మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ



ఫ్రై డే

- 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడగాల్పులతో అల్లాడిన ప్రజలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అన్ని మండలాల్లో శుక్రవారం తీవ్ర వడగాల్పులు వీచాయి. కనీస స్థాయిలో 42 డిగ్రీల నుంచి గరిష్టంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ గణాంకాలు విడుదల చేసింది. 27 మండలాల్లోనూ తీవ్ర వడగాల్పులు వీచాయనీ విపత్తుల సంస్థ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. కొత్తవలస, వంగర మండలాల్లో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బొబ్బిలి, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతి నగరం, జామి, రాజాం, రేగిడి ఆమదాల వలస, ఎస్.కోట, విజయనగరంలో 45 డిగ్రీలు, రామభద్రపురం, బాడంగి, భోగాపురం, చీపురుపల్లి, డెంకాడ, గంట్యాడ, గరివిడి, గుర్ల, మెంటాడ, పూసపాటి రేగ, సంత కవిటి, తెర్లాంలో 44 డిగ్రీలు, ఎల్. కోట, మెరకముడిదాంలో 43 డిగ్రీలు, నెల్లిమర్ల, వేపాడ ల్లో 42 వంతున ఉష్ణోగ్రత లు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఎండలతీవ్రత, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసిన వారు వడ గాల్పులతో ముఖాలు, కాళు,చేతులు మంటలతో ఇబ్బంది పడ్డారు. రాత్రి 8గంటల వరకు వేడి గాలులు వీయడంతో ఇళ్లలో ఉన్న వారు సైతం ఉక్కపోతతో విలవిలలాడారు.

ఎంపి నిధుల వినియోగంలో ముందంజ

- రోడ్లు, కాలువలు, కల్వర్టులు, విద్యుత్తు లైన్లకు ప్రాధాన్యత
- నిబంధనలతో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించని కేంద్రం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎమ్‌పి నిధుల వినియోగంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ ముందంజలో ఉన్నారు. రోడ్లు, కాలువలు, కల్వర్టులు, విద్యుత్ లైన్లు, సోలార్ సిస్టమ్స్, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. దీంతో, రెండు రోజుల క్రితం గడిచిన రెండేళ్లకు సంబంధించిన రూ.10కోట్లు కూడా మంజూరయ్యాయి. కానీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కరోనా సాకు, నిబంధనల మెలికలతో రూ.8కోట్లకు కన్నం పెట్టింది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.5కోట్లు చొప్పున కేటాయించాల్సివుంది. ఈలెక్కన 17వ లోక్‌సభ కాలపరిమితి పూర్తయ్యేనాటికి విజయనగరం పార్లమెంట్ స్థానానికి రూ.25కోట్లు రావాలి. కానీ, తొలి ఏడాది 2019-20లో రూ.2.50కోట్ల చొప్పున రెండు దఫాలుగా మొత్తం రూ.5కోట్లు కేటాయించారు. 2020-21లో కరోనా కష్టాల సాకుతో రూ.2కోట్లు చొప్పున మాత్రమే కేంద్రం ఇచ్చింది. అంతకు ముందు 16వ లోక్‌సభ నిల్వలు రూ.4.72కోట్లు ఉండేవి. పాత, కొత్త నిధులు, వాటి వడ్డీ కలుపుకుని సుమారు రూ.12.07కోట్లు కాగా, వాటిని ఎంపీ పూర్తిస్థాయిలో ఉపయోగించారు. ఈ నిధులతో మొత్తం 308 పనులు చేట్టగా ఇప్పటికే 213 పనులు పూర్తిచేసినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరో 64పనులు ప్రగతి దశలో ఉండగా, 31పనులు ఇంకా చేపట్టాల్సి వుందని అధికారులు చెబుతున్నారు. గరివిడిలో ఓవర్ బ్రిడ్జి, ఎలక్ట్రికల్ పోల్స్‌కు అత్యధికంగా ఖర్చుచేసినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మూడు అంబులెన్సులకు సుమారు రూ.90కోట్ల వరకు కేటాయించారు. మిగిలిన నిధులు పాఠశాల్లో మౌలిక సదుపాయాలకు, రోడ్లు, కాలువలు, కల్వర్లుకు ఖర్చు చేశారు. నిధులు నిల్వ లేకపోవడంతో రెండు రోజుల క్రితం 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి రూ.10కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 2021-22వ ఏటకు సంబంధించిన రూ.5కోట్లు, 2020-21లో మిగిలిన రూ.5కోట్లు గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. దీంతో, ఆ నిధులు ఇక వచ్చే అవకాశం లేదనే అనుమానాలు కలుగుతున్నాయి. కరోనా నుంచి కోలుకున్న తరువాత కూడా నిధులు విడుదల చేయకపోవడం పట్ల జనం నుంచి తీవ్ర అసహనం వ్యక్తమౌతోంది. విశాఖపట్నం పార్లమెంటరీ స్థానం పరిధిలో స్థానిక ఎంపీ 47 పనులకు రూ.2.55కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.10కోట్ల విలువగల కమ్యూనిటీ హాల్స్, సిసి రోడ్ల నిర్మాణం పూర్తిచేసినట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రతీ ఊరికి తారురోడ్డు

- విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ
- చీపురుపల్లి నియోజకవర్గంలో విస్తృత పర్యటన

ప్రజాశక్తి-మెరకముడిదాం, గుర్ల, గరివిడి

ప్రతీ ఊరికి తారురోడ్డును వేయడం ద్వారా, రహదారి సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం నియోజకవర్గంలో విస్తృత పర్యటన చేశారు. మెరకముడిదాం మండలం కొత్తకర్ర, సిరియాలపేట, కుంచుగుమడాం, సింగవరం, గరివిడి మండలం తోంద్రంగి, దువ్వాం, చింతపల్లి పేట, శేరీపేట, గుర్ల మండలం పెనుబర్తి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న బిటి రోడ్లను పరిశీలించారు. ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. పలు చోట్ల స్థానిక నాయకులతో, ప్రజలతో భేటీ అయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వారినుంచి వినతులు స్వీకరించారు. విద్యార్థులతో మాట్లాడి, విద్యాకానుక పంపిణీ, మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, తన నియోజకవర్గ పరిధిలో రహదారి సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు, మొత్తం 44 బిటి రోడ్లను నిర్మించడం జరుగుతోందని చెప్పారు. ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది కలగకుండా, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు.కొత్తకర్ర, కుంచుగుమడాం తదితర నాలుగు గ్రామాల ప్రజలకోసం అదనంగా మంచినీటి ట్యాంకు కట్టించి, కొత్తగా పైపులైన్లు వేసి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

ఎఎంసి కార్యాలయం ప్రారంభం

మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామంలో కొత్తగా రూ.25లక్షలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ట పరిచి, దానిని విస్తృతం చేయడం ద్వారా రైతులకు మేలు కల్గించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ ఎం.అప్పారావు, పంచాయితీరాజ్ ఎస్‌ఇ గుప్త, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, ఆర్‌డిఒ ఎం.అప్పారావు, మార్కెటింగ్ ఎడి గంగాధర్, డిఇ కోటయ్య, తాహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ రత్నం, ఎఒ శ్రావణి తేజ, ఎఇ ఆర్.పార్వతి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్లు ఎస్‌వి రమణరాజు, కెవి సూర్యనారాయణరాజు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసినాయుడు, మీసాల విశ్వేశ్వర్రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉప సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆస్పత్రిలో మృతి చెందారు. అప్పుల ఒత్తిడి, వైసిపి పెద్దల దగ్గర తగిన గౌరవం ఇవ్వడం లేదని తీవ్ర మనస్తాపంతో గురువారం తెల్లవారు జామున లక్ష్మునాయుడు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. విజయనగరం ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో లక్ష్మునాయుడు మతి చెందారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో లక్ష్మునాయుడు మృతదేహానికి పోస్టుమార్టం చేసి స్వగ్రామం అలజంగి తరలించారు. లక్ష్మునాయుడుకు వైసిపి, ఎపి రైతుసంఘం నాయకులు, అలజంగి ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. రైతులు, ప్రజల సమస్యలు పరిష్కారానికి పని చేసిన లక్ష్మునాయుడు మరణాన్ని రైతులు, ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. లక్ష్మునాయుడు మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, రైతులు, వైసిపి కార్యకర్తలు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. లక్ష్మునాయుడు పార్థీవదేహాన్ని వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు సందర్శించి, నివాళు లర్పించారు.

లక్ష్మునాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణుగోపాలనాయుడు

లక్ష్మునాయుడు మృతి రైతు ఉద్యమానికి తీరనిలోటు

అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు మృతి రైతు ఉద్యమానికి తీరని లోటని చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ అన్నారు. లక్ష్మునాయుడు మతికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోనే ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చెరకు రైతుల సమస్యలపై జరిగే పోరాటాల్లో లక్ష్మునాయుడు పాల్గొని రైతులు పక్షాన పని చేశారన్నారు. రైతులు, ప్రజల పక్షాన పని చేసిన లక్ష్మునాయుడు మతి కష్టజీవులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి సంతాపం

లక్ష్మునాయుడు మృతికి సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు సంతాపం తెలిపారు. బొబ్బిలి ప్రాంత రైతు ఉద్యమానికి, ప్రజా ఉద్యమాలకు అలజంగి గ్రామ పేద ప్రజలకు అండగా ఉన్న లక్ష్మునాయుడు లేని లోటు పూడ్చ లేనిదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితోనే ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

లక్ష్మునాయుడుది ప్రభుత్వ హత్య

అలజంగి ఉపసర్పంచ్ లక్ష్మునాయుడు ఆత్మహత్యకు సర్కారే కారణమని, అది ప్రభుత్వ హత్యేనని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు పి.శంకరరావు, ఎస్.గోపాలం అన్నారు. పొట్నూరు లక్ష్మునాయుడు మృతికి సిపిఎం నాయకులు సంతాపం ప్రకటించారు. లక్ష్మునాయుడు అలజంగిలో చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఒత్తిడి పెరిగినట్లు గ్రామస్తులు చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మునాయుడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'నారాయణ'లో పుస్తకాల పేరిట దోపిడీ

ఎస్ఎఫ్ఐ ఆందోళనతో సీజ్ చేసిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కార్పొరేట్ పాఠశాలల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విద్యార్థుల నుంచి 40వేలు నుంచి లక్ష రూపాయలు వరకు ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు మరోవైపు పుస్తకాల పేరుతో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. నారాయణ కార్పొరేట్ పాఠశాల పుస్తకాలను దొంగ చాటుగా అపార్ట్‌మెంట్‌లో ఉంచి వేలాది రూపాయలకు అమ్మడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ బృందం అడ్డుకుంది. పుస్తకాల గది వద్ద శుక్రవారం ధర్నాచేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాల దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం కళ్లు మూసుకున్నట్టు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం పాఠశాల యాజమాన్యాలు పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకూడదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ పాఠశాలలో జరుగుతున్న ఫీజులతో దోపిడీని, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని కోరారు.లేదంటే ఆ పుస్తకాలన్నింటినీ ఎత్తుకొని కలెక్టరేట్‌లో పడేస్తామని తెలిపారు. జిల్లా విద్యా యంత్రాంగం , రాష్ట్ర విద్యా యంత్రాంగం పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డిప్యూటీ డిఇఒ అక్కడికి చేరుకొని పుస్తకాల విక్రయ గదిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.సౌమ్య , జె.రవి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. హర్ష , జిల్లా కమిటీ సభ్యులు రమేష్, సమీర, నాయకులు జగదీశ్ ,సోమేశ్ ,వెంకటరణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల విక్రయ గదిని సీజ్ చేస్తున్న డిప్యూటీ డిఇఒతో ఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అమ్ముతున్న నారాయణ పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.మణికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని నారాయణ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాలు అమ్మకూడదని ప్రభుత్వం చెపుతున్నా కార్పొరేట్ విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. పుస్తకాలు అధిక ధరలకు అమ్ముకుని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. నారాయణ పాఠశాలపై కేసు నమోదు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డేవిడ్, అరిను, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

అక్రమ వాటర్‌ప్లాంట్‌ను సీజ్ చేయాల్సిందే

దళితులకు అండగా ఉండేది కమ్యూనిస్టులే : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనావాసాల మధ్య నిర్వహిస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్‌లను తక్షణమే సీజ్ చేయాలని, ప్రజలకి నీటిసౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అయ్యప్పనగర్‌లోని అక్రమంగానిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌తో పాటు నగరంలోని అనుమతి లేని ప్లాంట్‌లు అన్నింటినీ మూసివేయాలని అన్నారు. అప్పుగివరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అక్రమ వాటర్ ప్లాంట్‌లు సీజ్ చేసేందుకు ప్రజలు ముందుకు వస్తే వారికి అండగా ఉంటామని తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయ్యప్పనగర్‌లో స్వాతీ ప్యూర్ ఫైడ్ వాటర్ ప్లాంట్ వద్ద ధర్నా కు పిలుపునిచ్చిన రోజూ మున్సిపల్ అధికారులు సీజ్ చేశారంటే అది అక్రమమని రుజువైందన్నారు. మరోవైపు దళితులం కాబట్టి కక్ష కట్టి తమ వాటర్ ప్లాంట్ వద్ద పోరాడుతున్నారని వాటర్ ప్లాంట్ యజమాని అనడం సరైనది కాదన్నారు. మీవద్ద బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్ ఉంటే చూపించి మీ నిజాయితీ నిరూపించు కోవాలని అన్నారు. అధికారులు చోద్యం చూస్తూ ప్రజలకు, వాటర్‌ప్లాంట్ యజమానులకు తగవులు పెట్టడం సరికాదని అన్నారు. మరోవైపు ఆదాడ మోహన్‌రావు కమ్యూనిస్టు పార్టీలను నోటికొచ్చినట్లు విమర్శించడం తగదన్నారు. ఇళ్లకొచ్చి తంతామంటూ ఆదాడ మోహన రావు అనడం ఆయన అవివేకమన్నారు. ఆ పరిస్థితి ఎవరికొస్తుందో అందరికీ తెలుసునన్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. దళితులకు అండగా నిలబడింది కమ్యూనిస్టు పార్టీలేనని, అన్నారు. విజయనగరం జిల్లాలో కొత్తవలస, కొవ్వాడలో దళితుల భూములను ఎమ్మెల్యే, పెత్తందార్లు ఆక్రమిస్తే దళితులకు అండగా నిలబడింది సిపిఎం మాత్రమేనని అన్నారు. బొగ్గులదిబ్బ, జొన్నగుడ్డి, గంజిపేట దళితులను ఖాళీచేయించిస్తే వారికి అండగా నిలబడి పోరాడింది సిపిఎం అని అన్నారు. అయ్యప్పనగర్‌లో మే 3న వంద మంది ప్రజలు సంతకాలు పెట్టి స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు, వాటర్‌ప్లాంట్ మూసివేయాలని వినతి పత్రాన్ని సమర్పించారని తెలిపారు. . నేటికీ పట్టించుకోక పోతే ప్రజలు పోరాడుతున్నారని, వారికి మద్దతుగా పట్టణ పౌర సంక్షేమ సంఘం నిలబడిందన్నారు. వారికి మద్దతుగా ఐద్వా, సిఐటియు నాయకులు పోరాడితే ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ తప్పుడు కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులూ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ, వి.లక్ష్మి, సిఐటియు కార్యదర్శి యు ఎస్ రవి కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆటో బోల్తా 18 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొత్తవలస

ఆటో బోల్తా పడి 18 మంది ఉపాధి హామీ కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని చీపురువలసలో చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం ప్రకారం...

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో చీపురువలసకు చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం మిందివలస అప్పలరాజు చెరువులో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం పనులు ముగించుకుని తిరిగొస్తుండగా వారు ప్రయాణిస్తున్న ఆటో మార్గం మధ్యలో బోల్తా పడింది. ఈ ఘటనలో 18 మందికి గాయాలయ్యాయి. అందులో రంది ఎరుకమ్మకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం తరలించారు. మిగిలిన క్షతగాత్రులు కొత్తవలసలోని సంజీవని హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. అనివిరెడ్డి దేవుడమ్మకు కాలర్ బోన్ ఫ్యాక్చర్ అయింది. రంది లక్ష్మికి రెండు చేతులు విరిగిపోయాయి, అనివిరెడ్డి ఎర్రయమ్మ, జె.రవణమ్మ, ఆర్.ఈశ్వరమ్మ, వి.గంగాభవాని, ఎ.కోటలక్ష్మి, ఎ.లక్ష్మికి బలమైన గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, సర్పంచ్ ఎం.ఎర్రయ్య రామస్వామి.. ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్ పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, అయ్యారక సాధికార సమితి కన్వీనర్ బంగారు రమేష్, నాయకులు కొరుపోలు అప్పారావు, ఎల్లపు సూరిబాబు, లాలం అర్జునరావు, కొట్టాన విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

23 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

రోజు తప్పించి రోజు నెల రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు.. ప్రజా సమస్యలకు మరింత నాణ్యమైన పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతుందని దానిలో భాగంగా జిల్లాలో కూడా ఆ రోజు నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలిసి కలెక్టరేట్‌నుంచి శుక్రవారం ఎంపిడిఒలు,తహాశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. 23వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి శిబిరం రోజు వాటికి సరైన పరిష్కారం చూపుతూ సంబంధిత ధ్రువ పత్రాలు మంజూరు చేయాలని సూచించారు. తొమ్మిది రకాల సేవలను మిషన్ మోడ్‌లో ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. ఎంపిడిఒలు, తహాశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో కలిసి రెండేసి ప్రత్యేక బృందాలను నియమించుకోవాలని తెలిపారు. 17న క్షేత్ర స్థాయి సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని, 19న వాలంటీర్లకు శిక్షణ అందజేయాలని చెప్పారు. 20వ తేదీ నుంచి వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి కార్యక్రమ షెడ్యూల్లో పేర్కొన్న తొమ్మిది రకాల సేవలకు సంబంధించిన అంశాలను గుర్తించి శిబిరం నిర్వహించే రోజున వాటికి పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.

తొమ్మిది రకాల సేవలకు సత్వర పరిష్కారం

ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ, మ్యుటేషన్ సర్టిఫికేట్, ఇతర అంశాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ అనుసంధానం, సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డు) సేవలు ఈ శిబిరాల్లో అందిస్తారు. ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించేందుకు, పరిష్కారం చూపేందుకు అనుగుణంగా నాలుగు ప్రత్యేక డెస్కులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వాటిలో రిజిస్ట్రేషన్ డెస్కు, వెరిఫికేషన్ డెస్కు, సర్వీస్ రిక్వెస్టు డెస్కు, జగనన్నకు చెబుదాం డెస్కు ఉంటాయని పేర్కొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అయ్య కోనేరు దక్షిణ గట్టు ప్రాంతానికి చెందిన 60 మందికి ఇళ్ల పట్టాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అందజేశారు. దక్షిణ గట్టు ప్రాంతంలో 40 మందికి, లంక వీధి ప్రాంతంలో 12 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో ఆ కుటుంబాల్లో ఆనందం వెల్లి విరిసింది. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ చాలా ఏళ్ళుగా దక్షిణ గట్టు ప్రాంతంలో నివాసముంటూ పట్టాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులను ఎదుర్కొన్నాయని అన్నారు. పెద్ద చెరువు సుందరీ కరణ లో భాగంగా తాము పర్యటించినప్పుడు ఈ ప్రాంత వాసుల ఇబ్బందులను గమనించి పట్టాల మంజూరుకు హామీ ఇచ్చానన్నారు. అనుకున్న విధంగానే ఎక్కడా అవినీతి లేకుండా ఇళ్లపట్టాలను మంజూరు చేసిన ఘనత తమదేనని అన్నారు. ఇన్చార్జి కమిషనర్ ప్రసాద్ రావు, తాసిల్దారు కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి ప్రేమజంట ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రేమజంట రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని నిమ్మలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నిమ్మలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద యువ జంట మృతదేహాలను శుక్రవారం ఉదయం గుర్తించారు. సమీపంలో బ్యాగులను గుర్తించి, అందులో ఆధార్ కార్డులను రైల్వే పోలీసులు పరిశీలించారు. వీరిది అరకు జిల్లా అనంతగిరి మండల వాసులుగా గుర్తించారు. నందుల చంద్రన్న (32)ది తాడిగూడ గ్రామం. సెంబి స్వాతి(17) ఆమిగడ్డవలస గ్రామంగా నిర్ధారించారు. వీరు రైలు కిందపడి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలియరాలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.



చంద్రన్న, స్వాతి (ఫైల్)

రైల్వే ట్రాక్‌పై చంద్రన్న, స్వాతి మృతదేహాలు

బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ఆసరా డబ్బుల కోసం ఆందోళన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా డబ్బులు కోసం పిరిడిలోని ఎపిజివిబి బ్రాంచ్ వద్ద శుక్రవారం పొదుపు మహిళలు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నెల రోజుల క్రితం పిరిడి, శివడవలస, కమ్మవలస గ్రామాలోని 217 గ్రూపుల సభ్యులకు ఆసరా డబ్బులు రూ.1.31 కోట్లు ఆ బ్యాంకులో జమచేసింది. ఈ మొత్తాన్ని ఆయా గ్రామాల పొదుపు సంఘ సభ్యులకు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు తిప్పుతున్నారని మహిళలు ఆందోళనకు దిగారు. వైసిపి సిబ్బందిని వివరణ కోరగా బ్యాంకు మేనేజర్ సెలవులో ఉన్నారని, ఒకట్రెండు రోజుల్లో సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.

నానిని అభినందిస్తున్న బద్దుకొండ ప్రదీప్, నాయకులు

క్రీడాకారిణికి అభినందన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఖేల్ ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన గరికిపేటకు చెందిన క్రీడాకారిణి బెల్లాన నానికి వైసిపి యువజన విభాగం నాయకులు బద్దుకొండ ప్రదీప్ రూ.10 వేల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. నానితోపాటు కోచ్ బి.రవిని అభినందించారు. నానికి గరికిపేటకు చెందిన సభ్యులు సత్యనారాయణ 10 వేలు, నెల్లిమర్ల నగర పంచాయతీ 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ 5 వేలు అందించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, కొండగుంపాం సర్పంచ్ పతివాడ అప్పన్న, పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు పాల్గొన్నారు.

విద్యుత్తు స్టోర్స్ హమాలీలకు 'కాంట్రాక్టు' అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యుత్తు జిల్లా స్టోర్స్ హమాలీలకు ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో అవకాశం కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్తు జిల్లా స్టోర్స్ వద్ద హమాలీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. 40 సంవత్సరాలుగా విద్యుత్తు స్టోర్స్ హమాలీలుగా పని చేస్తున్న కార్మికులకు పీస్‌వర్క్ విధానం అమలు చేయడం వల్ల నష్టపోతున్నారని తెలిపారు. పీస్ వర్క్ విధానం రద్దు చేసి హమాలీలకు కాంట్రాక్టు పద్ధతిలో చెల్లింపులు జరపాలని కోరారు.

'పవన్‌ను విమర్శిస్తే సహించేది లేదు'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ యోగ్యత మరచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదని జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల పడుతున్న ఇబ్బందులు, సమస్యలను పవన్ కళ్యాణ్ లేవనెత్తితే వైసిపినాయకులు మితిమీరి విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా బందర్ నాని సంస్కారం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించే అర్హత నానికి లేదన్నారు. కాపులంతా వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపిపి అచ్చెన్నాయుడు

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని చిన్నశిర్లాం ఆర్‌బికెలో రైతులకు వైస్ ఎంపిపి టంకాల అచ్చెంనాయుడు వరి విత్తనాలను పంపిణీ చేశారు. సబ్సిడీపై ప్రభుత్వం అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఒ గిరడ మురళీకృష్ణ, సర్పంచ్ టంకాల ఉమా పాపినాయుడు, సోషల్ మీడియా మండల కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, విఎఎ పార్వతి పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ

డెంకాడ : మండలంలో సింగవరం ఆర్‌బికెలో నవధాన్యాల కిట్లను ఉత్తరకోస్తా ఆర్‌టి ఎల్.ప్రకాశ్, ఆర్‌టిఒ హేమంత్ కుమార్ రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల సాగుతో ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఇఒ రామకోటి, సిఎ గురుమూర్తి పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి-రేగిడి

పాఠశాల విద్యార్థులకు మెనూ పక్కాగా అమలు చేయాలని ఎఇఒ ఎం.వరప్రసాదరావు సూచించారు. శుక్రవారం రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.. ముందుగా ఆహార పదార్థాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో రామస్వామిపేట, పాటూరు గ్రామాలలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయాన్నే పనులు ప్రారంభించి, ఎండ తీవ్రత కాకముందే పూర్తిచేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు.

కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి-వేపాడ


కంప్యూటర్లను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మండలంలోని బల్లంకి గ్రామంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణ కోసం విశాఖపట్నం జిల్లాకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ మూడు కంప్యూటర్లను అందజేసింది. కార్యక్రమంలో ఎంపిటిసి గొంప తులసి, వైస్ సర్పంచ్ పల్లె ధనుంజయ, వార్డు సభ్యులు బొడ్డు శీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతపై పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

నాడు-నేడు కింద ఆసుపత్రుల అభివృద్ధికి మంజూరైన పనులను వేగంగా పూర్తి చేసి సంబంధిత వైద్యులకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అందుబాటులో నున్న నిధులకు తగ్గట్టుగా పనులకు ప్రాధాన్యతనిచ్చి అత్యంత అవసరమైన వాటిని ముందుగా పూర్తి చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిహెచ్‌సి , ఏరియా ఆసుపత్రి, వైద్య కళాశాల పనుల పై ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పిహెచ్ సి , ఏరియా ఆసుపత్రుల మరమ్మత్తులకు కేటాయించిన నిధులు అందుబాటులో ఉన్నాయని, లేబర్ ప్రణాళిక వేసుకొని, సిమెంట్, ఇతర సామగ్రిని ఏర్పాటు చేసుకోవలని తెలిపారు. ఓపి నడపడానికి వీలుగా తొలుత ఎక్విప్‌మెంట్ ల్యాబ్, టాయిలెట్స్, విద్యుత్, ఆసుపత్రులకు వాహనాలు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. వచ్చే నెలలోగా ఈ వసతులను పూర్తి చేయాలన్నారు. మరమ్మత్తులు , నిర్మాణాలు పూర్తి అయిన వాటిని వెంటనే ప్రారంభించాలని , ప్రహరి గోడలు పూర్తి కాలేదని ప్రారంభాలు పెండింగ్ ఉంచకూడదని అన్నారు. ఇటీవల తన పర్యటనలో భాగంగా రామభద్రాపురం పిహెచ్‌సి తనిఖీ చేయడం జరిగిందని, అయితే అక్కడ లేబర్ రూమ్ లో రన్నింగ్ టాయిలెట్ లేదని, టాయిలెట్ కు తలుపు లేదని, కనేసం లైట్ కూడా లేదని, ఇలా అయితే సర్జరీ లు జరిగేదేలా అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఏయే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలో ఇంజినీరింగ్ అధికారులకు కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. ఆర్అండ్‌బి ఎస్ఇ, ఇఇలు వారంలోగా అన్ని పనులను వ్యక్తిగతంగా తనిఖీ చేయాలన్నారు. కనీస అవసరాలకు ప్రాధాన్యత నిచ్చి పనులు వేగంగా జరగాలన్నారు. వెళ్లే ముందు సంబంధిత వైద్యునికి సమాచారం ఇవ్వాలని, వైద్యునితో కలసి నిదులెంత ఉన్నది, ఆ నిధులతో ఏయే పనులు చేపట్టవచ్చో చర్చించుకొని చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల పనుల పై సమీక్షిస్తూ త్వరగా ముగింపు పనులను పూర్తి చేయాలనీ ఆదేశించారు. వచ్చే సమావేశానికి అర్బన్ హెల్త్ క్లినిక్స్ పై కూడా సమీక్షించడం జరుగుతుందని, మున్సిపల్ అధికారులు కూడా హాజరు కావాలని అన్నారు. సమావేశం లో డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్, ఎస్ఇ ఆర్అండ్‌బి విజయరత్నం, ఇఇ వెంకటరమణ, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ ప్రసాద్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.


ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

యువ ఓటర్ల నమోదుపై దృష్టి

జిల్లాలో వచ్చే జూలై నుంచి ప్రారంభమయ్యే ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం ఎంతో కీలకమైనదని, ఆయా నియోజకవర్గాల ఇఆర్‌ఒలు ప్రత్యేక దష్టిసారించి తప్పొప్పులు లేని ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను గుర్తించే కార్యక్రమం చేపట్టడం ద్వారా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లాలోని ఇఆర్‌ఒలతో కలెక్టర్ ఓటర్ల జాబితా సవరణపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడులో భాగంగా జిల్లాలోని చాలా పాఠశాలల్లో అదనపు వసతులు సమకూరాయని, ఏదైనా పోలింగ్ బూత్‌లు ఇరుకు గదుల్లో వున్నట్లయితే అటువంటి చోట కొత్తగా నిర్మించిన పాఠశాల భవనాల్లోకి పోలింగ్ కేంద్రాన్ని మార్చేలా ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. 18-19 సంవత్సరాల యువతను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల గుర్తింపు సర్వే చేసే సమయంలోనే ఈ యువతను గుర్తించాలన్నారు. అదేవిధంగా ఒకే వ్యక్తికి పలు నియోజకవర్గాల్లో ఓటులేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు ఎం.వి.సూర్యకళ, అప్పారావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలీల, నూకరాజు, మున్సిపల్ కమిషనర్‌లు బాలాజీ ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగదు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపకలను ఇచ్చి సత్కరించారు. జొన్నవలస ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న జగన్మోహన్ రెడ్డి ఆదర్శప్రాయుడని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫలితాలను మరింతగా మెరుగుపరచడమే ధ్యేయంగా కృషి జరుగుతోందన్నారు. ప్రస్తుతం ర్యాంకుల సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని తదుపరి విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. నగర మేయర్ విజయలక్ష్మి , మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, సర్పంచ్ కందిర రమాదేవి, ఎంపీడీవో గంటా వెంకట్రావు, మజ్జి అప్పారావు, ఎంఇఒ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్‌కె గౌష్య నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు సత్కరించి, నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.భీమశంకరరావు, ఎస్ఎస్ఎస్ పిఒ శ్రీరాములు, అధ్యాపకులు రామలక్ష్మి, జగన్నాథం పాల్గొన్నారు.

నెల్లిమర్ల : కొండవెలగాడ హైస్కూల్లో ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన సుంకరి దుర్గ భవాని (563మార్కులు), వాల్లె రూప (559 మార్కులు), కొసర హరీష్ (537 మార్కులు)ను జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.జ్ఞానేశ్వరరావు, నాయకులు మొయిద అక్కోజీ, వాల్లె అప్పలనాయుడు, ఉపాధ్యాయులు ఎన్‌పికె ధూళికేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు సర్పంచ్ ఎర్ర రామలక్ష్మి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి నగదు పురస్కారాలను అందజేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం

శృంగవరపుకోట : ధర్మవరం హైస్కూల్లో చదివి పదో తరగతిలో 569 మార్కులు సాధించిన మిడతాన లిఖితకు స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎ.వెంకటరావు రూ.10 వేల నగదు, మెమోంటోను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకట్రావు, పీడీ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.



విజయనగరం, వేపాడలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, సర్పంచ్ రామలక్ష్మి, ఎంపిటిసి లక్ష్మి

మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

రైతులకు నష్టం కలిగితే ఊరుకోం

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

పెందుర్తి - బొడ్డవర జాతీయ రహదారి 516-బి ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, ఈ హైవే కారణంగా రైతులకు నష్టం కలిగితే ఊరుకోబోమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు స్పష్టంచేశారు. రహదారి కారణంగా భూములు కోల్పోతున్న బాధితులతో స్థానిక చెరుకు కాటా వద్ద శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారి కారణంగా నివాసాలు, పంట పొలాలను కోల్పోతున్నారని, చిరు వ్యాపారులు కూడా నష్టపోతున్నారని ఆందోళన చెందారు. వారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రహదారి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు చల్లా జగన్, సిఐటియు మండల అధ్యక్షులు తరిణి వెంకటరమణ, నాయకులు గొంప కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వివిధ డివిజన్లలో రూ.53లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. 6వ డివిజన్ లోని సింగపూర్ సిటీ వద్ద రూ.40 లక్షలతో కాలువ నిర్మాణానికి, 17, 18 డివిజన్లో రూ.13లక్షలతో సిసి రహదారులు, కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సంపూర్ణ మాలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారన్నారు. పనులు ప్రారంభించడమే కాకుండా అవి పూర్తి అయ్యేవిధంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా 17, 18 డివిజన్లో రహదారులు, కాలువలు నిర్మాణానికి వెచ్చిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ లయ యాదవ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో సైతం అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఆశపు సుజాత, ఆల్తి సత్యకుమారి, మీసాల రమాదేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, బోడసింగి ఈశ్వరరావు, బొద్దాన అప్పారావు, కోఆప్షన్ సభ్యులు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ లెంక వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ..

గాజులరేగలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ప్రజాస్పందన కూడా అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. స్థానికంగా నెలకొన్న వీధి దీపాలు ఏర్పాటు విషయమై తక్షణమే స్పందించిన ఆయన లైట్లు ఏర్పాటు చేయాలని అక్కడున్న అధికారులకు ఆదేశించారు. మేయర్ విజయలక్ష్మి, ఇన్చార్జి కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, సచివాలయ కన్వీనర్ కరణపు ముత్యాలరావు, జోనల్ ఇన్చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ షాపుల తొలగింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

పోలీసులను నిలదీస్తున్న చిరు వ్యాపారులు

పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపం ప్రహరీని అనుసరించి ఉన్న షాపులను శుక్రవారం ఉద్రిక్తతల నడుమ మున్సిపల్ అధికారులు తొలగించారు. టిటిడి కళ్యాణ మండపం ప్రహరీ గోడకు అనుసరించి చిరు వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఆ కళ్యాణ మండపంలో వివాహాలు జరుగుతున్న సమయంలో పార్కింగ్ సమస్య తలెత్తి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని నిర్వాహకులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు, టిటిడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో షాపులకు ఉన్న విద్యుత్తు కనెక్షన్ కట్ చేయాలని విద్యుత్తు శాఖ అధికారులకు, షాపులను తొలగించాలని మున్సిపల్ అధికారులకు టిటిడి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. దీంతో రెండు రోజుల క్రితం విద్యుత్తు కనెక్షన్ కట్ చేశారు. శుక్రవారం మున్సిపల్ అధికారులు క్రేన్ల సహాయంతో షాపులను తొలగించారు. షాపు యజమానులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నోటీసులు ఇవ్వకుండా షాపులను తొలగించడం అన్యాయమని, కొన్ని రోజులు గడువు ఇవ్వాలని వ్యాపారులు.. పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, టిపిఎస్ వరప్రసాద్‌ను కోరారు. మున్సిపల్ కమిషనర్ అనుమతులు ఇస్తే అభ్యంతరం లేదని వారు చెప్పారు. కమిషనర్ శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో పోలీసు బందోబస్తు మధ్య షాపులను తొలగించారు.

షాపుల తొలగింపు అన్యాయం

టిటిడి కళ్యాణ మండపం వద్ద ఉన్న షాపులను తొలగించడం అన్యాయమని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు పి.శంకరరావు, కోట అప్పన్న, ఎం.శ్రీనివాస్, పిసిసి సభ్యులు ముద్దల శ్రీనివాస రావు అన్నారు. పేదలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. షాపులు కోల్పోయిన వ్యాపారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి యువ నాయకులు గొంప కృష్ణపై కెజిపూడి మాజీ సర్పంచ్ తప్పుడు ప్రచారం మానుకోవాలని తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి హితవుపలికారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కెజిపూడి పంచాయతీ పరిధిలో టిడిపి నాయకులు దొగ్గ రమేష్ పిలుపుమేరకు పార్టీ ఆత్మీయ సమావేశానికి గొంప కృష్ణ హాజరయ్యారని చెప్పారు. అంతే తప్ప చీకటి రాజకీయాలు ఆయనేమీ చేయలేదని స్పష్టంచేశారు. పార్టీ బలోపేతానికి యువత అవసరమని దిశానిర్దేశం చేశారని చెప్పారు. వైసిపితో లాలూచీ కొనసాగిస్తూ అక్రమంగా వ్యాపారాలు చేస్తున్నదెవరో అందరికీ తెలుసునన్నారు. తప్పుడు ప్రకటనలు చేయడం వల్ల పార్టీకి నష్టమని, ఒకరిని విమర్శించే ముందు వాస్తవమేమిటో గ్రహించాలని హితవుపలికారు. సమావేశంలో టిడిపి నాయకులు సిరికి రమణ, శానాపతి గణేష్, తాడి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలు చేయొద్దు

శృంగవరపుకోట : గోపాలపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గ్రూపు రాజకీయాలు మానుకోవాలని సర్పంచ్ ఆడారి మహేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభంజనంలో కూడా గోపాలపల్లి పంచాయతీలో టిడిపి జెండా ఎగురవేశామని తెలిపారు. అలాంటి సమయంలో తమను ప్రోత్సహించాల్సిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి.. గ్రామంలో టిడిపికి మరో గ్రూపును తయారు చేయడం దారుణమన్నారు. గ్రామంలోకి వచ్చినప్పుడు కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా, ఏదో పనిపై వస్తున్నట్లు చెప్పి, పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఇలా చేస్తే వచ్చే ఎన్నికల్లో టిడిపి పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఏమైనా ఉంటే సూటిగా చెప్పాలి తప్ప తాము ఊళ్లో లేని సమయంలో ఎవరికీ తెలియకుండా ఒక మేడపై చీకట్లో సమావేశం పెట్టి వెళ్లిపోవడం ఏమిటని నిలదీశారు.

రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చీడివలస గ్రామంలో శుక్రవారం మలేరియాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చీడివలసలో వైఎస్ఆర్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి ఇ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మలేరియాపై అవగాహన కల్పించారు. వీధుల్లో టైర్లు, కొబ్బరి బొండాలు, ఇంటి ముందు నీరు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ నరసింహారావు, తిరుపతిరావు, హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు సత్యారావు, ఈశ్వరరావు, గీతిక, ఎఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వడదెబ్బతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని సింగవరంలో శుక్రవారం వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన సందక బంగారుబాబు (65) పశువులను మేత కోసం చంపావతి నది వైపు తోలుకెళ్లాడు. అక్కడ పశువులు మేపుతుండగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బకు గురై పడిపోయాడు. తోటి కాపరులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. గ్రామానికి తీసుకొచ్చి చూడగా అప్పటికే ఆయన మరణించాడు.

కోడి పందేల స్థావరంపై దాడి

నెల్లిమర్ల : మండలంలోని చంద్రంపేటలో కోడి పందేల స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. 24 మందిని అరెస్టు చేశారు. మూడు కార్లు, 3 బైక్‌లు, రూ.32 వేల నగదు, 5 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

బిందు సేద్యం లాభదాయకం

ప్రజాశక్తి-బాడంగి

బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ పిఎన్‌వి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఆకులకట్ట, గొల్లాది గ్రామాల్లోని శుక్రవారం ఆయన పర్యటించారు. చప్ప సూర్యనారాయణ, కేతిరెడ్డి అప్పలనాయుడు, బెవర పార్వతికి అందించిన బిందు, తుంపర సేద్య యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో పంటల సాగుకు బిందు, తుంపర సేద్య విధానాలు లాభదాయకమని తెలిపారు. ఎరువుల యాజమాన్యంలో మెలకువలు పాటించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించవచ్చన్నారు.

మండలంలోని 37 మంది రైతులకు రూ.19,34,792 విలువైన సూక్ష్మ సేద్య యూనిట్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ సతీష్, ఎంఐఎఒ శంకర్, కంపెనీ డిసిఒ శీర రాజేష్ , రైతులు పాల్గొన్నారు.